సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 28 । జూలై । 2023

జలమయమైన సిరిసిల్ల - కరీంనగర్ రహదారి



జల దిగ్బంధం



సిరిసిల్లలో రహదారిపై వరద నీటిలో పడిపోయిన మహిళలను కాపాడుతున్న స్థానికులు

- సిరిసిల్ల గుండె చెరువైంది
- ఎగువ మానేరు.. మూలవాగు ఉగ్రరూపం
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- తెగిన చిన్నబోనాల పెద్ద చెరువు
- కల్వర్టులు, లోలెవల్ వంతెన వద్ద నీటి ఉధృతి
- నిలిచిన రాకపోకలు.. జనం అవస్థలు
- వేములవాడలో అత్యధికంగా 152.2 మి.మీ వర్షపాతం
- వరదలపై సమీక్షించిన మంత్రి కేటీఆర్
- సహాయక చర్యల్లో కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, మున్సిపల్, 'సెస్' అధికారులు

సిరిసిల్ల: జిల్లాపై గురువారం వర్షం విరుచుకుపడింది. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం తెల్లారేసరికి కుంభవృష్టిగా మా రింది. జన జీవనం స్తంభించింది. సిరిసిల్ల పట్టణ శివారులోని చిన్నబోనాల పెద్ద చెరువుకు గండి పడడంతో ఆ నీరంతా పట్టణాన్ని ముంచెత్తింది. వెంకంపేట, సర్దార్‌నగర్, పద్మనగర్, శాంతినగర్, సంజీవయ్య నగర్, అశోక్‌నగర్, అనంత్‌నగర్, ఆటోనగర్, ఇస్లాంపుర, పెద్ద బజారు ప్రాంతాల్లో వరదలు వీధులను ముంచెత్తాయి. మూడు అడుగుల ఎత్తుతో నీరు ప్రవహించడంతో ఇళ్లలోకి వరద చేరి సరుకులు తడిసి ముద్దయ్యాయి. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ లేక జనం అల్లాడిపోయారు. కార్మిక వాడలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సిరిసిల్ల-కరీంనగర్ మార్గంలో పాత బస్టాండు నుంచి కొత్త చెరువు కట్ట వరకు వరద రోడ్డును ముంచెత్తింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యమానేరు జలాయానికి మానేరు, మూలవాగు నుంచి వరద పోటెత్తడంతో 22 గేట్లను ఎత్తి 1,10,572 క్యూసెక్కుల నీటిని వదిలారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు పరవళ్లు తొక్కింది.

జిల్లా అంతటా వాన జోరు

జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. జిల్లాలోని 666 చెరువుల్లోకి భారీగా వరద చేరింది. జిల్లాలో అత్యధికంగా వేములవాడలో 152.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, రుద్రంగి 103.5, చందుర్తి 119.5, వేములవాడ రూరల్ 77.6, బోయినపల్లి 139.0, సిరిసిల్ల 112.0, కోనరావుపేట 99.9, వీర్నపల్లి 70.1, ఎల్లారెడ్డిపేట 131.1, గంభీరావుపేట 79.7, ముస్తాబాద్ 101.5, తంగళ్లపల్లి 116.2, ఇల్లంతకుంటలో 124.5 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 55 పాత ఇళ్లు కూలాయి.

పోలీసుల సహాయక చర్యలు..

సిరిసిల్లలో గురువారం ఉదయం నుంచి పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్, సిబ్బంది, డీఆర్‌ఎఫ్ బృందాలతో సహాయక చర్యలు చేపట్టారు. వరద నీటిలో చిక్కినవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి స్వయంగా వృద్ధులు, మహిళలను చేతులపై ఎత్తుకుని వరద నీటిని దాటించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం విశేషం.



మహిళను చేతులపై ఎత్తుకుని తీసుకెళ్తున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



వృద్ధురాలిని మోసుకెళ్తున్న పోలీసులు

మంత్రి కేటీఆర్ ఆదేశాలతో..

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడడంతో మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఫోన్‌లో గురువారం సమీక్షించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి ఆదేశాలతో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, 'సెస్' ఎండీ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బాధితులకు సాయం అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్లు క్షేత్రస్థాయిలో బాధితులకు సాయం చేశారు. సిరిసిల్ల ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు స్వచ్ఛందంగా ట్రాక్టర్లను సమకూర్చి బాధితులను తరలించారు.



గండిపడిన చిన్నబోనాల పెద్ద చెరువు



తంగళ్లపల్లిలో కుప్పకూలిన రైస్ మిల్లు



సంజీవయ్యనగర్‌లో ఇంట్లోకి నీరు రావడంతో కుర్చీలో కూర్చున్న అన్నారం కనకయ్య



నీట మునిగిన సర్దార్‌నగర్, ప్రగతినగర్ కాలనీలు



సాంచాల కార్ఖానాలో చేరిన వరద నీరు



జేసీబీలో జనాన్ని తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది



సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు

లోతట్టు ప్రాంతాల్లో రెడ్‌అలర్ట్



పరిశీలిస్తున్న ఎస్పీ, చైర్‌పర్సన్, తదితరులు



పేషెంట్లను తరలిస్తున్న తహసీల్దార్


సిరిసిల్లటౌన్: పట్టణాన్ని చుట్టుముట్టిన వరద నీటితో సిరిసిల్ల చెరువును తలపిస్తుంది. ఎగువన ఉన్న బోనాల చెరువు తెగడం.. కొత్తచెరువు, రాయించెరువు, ఈదుల చెరువు, జంగ వానికుంటలు పొంగిపొర్లాయి. వరదల మూలంగా సిరిసిల్ల పట్టణంలో 1, బోనాల 2, పెద్దూరులో 2 ఇళ్లు కూలిపోయాయి. కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ ప్రత్యేకంగా ట్రాక్టర్లలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. భారీ వర్షాలతో సిరిసిల్లకు వచ్చే కొన్ని రూట్లలో బస్సులు బంద్ చేశారు.

కంట్రోల్ రూం నంబర్లు

కలెక్టరేట్	93986 84240
సిరిసిల్ల మున్సిపల్	78935 93330

కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్, వరంగల్, కామారెడ్డి తదితర ప్రాంతాలకు కొత్తబస్టాండు నుంచి రాకపోకలు సాగించారు. వేములవాడ డిపో పరిధిలో కోరుట్ల, జగిత్యాల రూట్లలో బస్సులు నడుపలేదు. సింగారం గ్రామానికి చెందిన అఖిల డెలివరీకోసం సిరిసిల్ల కామాక్షి ఆస్పత్రిలో చేరగా, ఆస్పత్రి చుట్టూ నీరు చేరడంతో వేరే ఆస్పత్రికి వెళ్లాలని సూచించగా, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో తహసీల్దార్ విజయ్‌కుమార్ అఖిలను సురక్షితంగా ఇతర ఆస్పత్రికి తరలించారు.

పర్యవేక్షించిన ఎస్పీ



ట్రాక్టర్‌లో పర్యవేక్షిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: చిన్నబోనాల చెరువు కట్ట తెగడంతో పట్టణంలోని వెంకంపేట జలమయమైంది. ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ ట్రాక్టర్‌పై తిరుగుతూ వరద పరిస్థితిని పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట ఏరియాలో వరద నీరు ఇంటిలో రావడంతో హుటాహుటినా సీఐ ఉపేందర్ నేతృత్వంలోని పోలీసులు ఇంట్లో ఉన్న వృద్ధురాలిని భూజాలపై ఎత్తుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు. చికిత్స నిమిత్తం వచ్చి సంజీవయ్యనగర్‌లో చిక్కున్న వారిని తాడు సాయంతో సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లారు.

డీజీపీ ట్వీట్

కష్టకాలంలో సహాయంలో చేయడంలో పోలీసులు ముందుంటారని రాష్ట్ర డీజీపీ అంజని కుమార్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. సిరిసిల్లలో కురిసిన భారీ వర్షంలో చిక్కుకున్న మహిళను రక్షించిన సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్ నిజమైన హీరోలంటూ ప్రశంసలు కురిపించారు.

ప్రమాదం అంచున భీమన్న గుడి



ఉరుస్తున్న భీమన్న గుడి

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ భీమన్న గుడి ప్రమాదం అంచుల్లోకి చేరుకుంది. గురువారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి ఆలయంలో ఉరవడం మొదలైంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

మిడ్ మానేరుకు పోటెత్తిన వరద

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. గురువారం రాత్రి 7 గంటల వరకు 1,10,572 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. ఈ క్రమంలో 22 గేట్ల ద్వారా ఎల్‌ఎండీలోకి 1,10,572 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరులోకి వరదకాల్వ, వేములవాడ మూలవాగు, నర్మాల ఎగువ మానేరు, సిరిసిల్ల పెద్దవాగు, చిన్నవాగుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.82 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. గురువారం ఒక్క రోజే ప్రాజెక్టులోకి ఒక టీఎంసీకి పైగా వరద చేరడం రికార్డుగా అధికారులు చెబుతున్నారు.

ఉగ్రరూపం దాల్చిన ఎగువమానేరు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాలైన కూడవెల్లి, పాల్వంచ వాగుల ద్వారా వరద ప్రాజెక్టులోకి భారీగా చేరుతోంది. ప్రా జెక్టు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, ఆయకట్టు రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గోరంటాల మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తూ సింగసముద్రంలోకి చేరుతోంది.



ఉప్పొంగుతున్న ఎగువమానేరు ప్రాజెక్టు

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

సిరిసిల్ల: జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఫోన్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో మాట్లాడారు. వరదలతో ఇబ్బందులు పడే ప్రభావిత ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అందరూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే హైదరాబాద్ నుంచి సహాయక చర్యలు అందించేందుకు బృందాలను పంపిస్తామని పేర్కొన్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి వర్షాలపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని మండలాలకు వరదలపై గంటకోసారి నివేదిక ఇచ్చేలా అధికారులను నియమించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు గురువారం 35 వినతులు వచ్చాయి. చిన్నబోనాల పెద్ద చెరువును అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ గురువారం సాయంత్రం పరిశీలించారు. గండిని పూడ్చాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లిలో రైస్ మిల్లు కుప్పకూలింది. జిల్లాలో వరదల్లో చిక్కుకున్న 120 మందిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

నీట మునిగిన సబ్‌స్టేషన్



వేములవాడలో నీట మునిగిన సబ్ స్టేషన్

వేములవాడ: భారీ వర్షాలకు మూలవాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి సపోర్ట్ పిల్లర్లు కూలిపోయాయి. సబ్ స్టేషన్‌లో నీరు నిలవడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. వేములవాడ నుంచి కొండగట్టు, బోయిన్‌పల్లి, సిరిసిల్ల, కోరుట్ల, హన్మాజిపేట రహదారులను పోలీసులు మూసివేశారు. వరద బాధితులను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో పవన్‌కుమార్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ రాజారెడ్డి, సీఐ కరుణాకర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ తదితరులు పరామర్శించి సహాయక చర్యలు చేపట్టారు.



గంగమ్మ గుడిని తాకుతూ ప్రవహిస్తున్న మూలవాగు



బోయినపల్లి: తెగిన బోయినపల్లి -మర్లపేట కల్వర్టు

న్యూస్‌రీల్

నలుగురికి ఆర్డీవోలుగా పదోన్నతి



బొద్దుల గంగయ్య



ఎస్.రాజిరెడ్డి



సదానందం



శ్రీనివాస్

సిరిసిల్ల: జిల్లాలో తహసీల్దార్లుగా పని చేస్తున్న నలుగురికి డెప్యూటీ కలెక్టర్‌లు (ఆర్డీవోలు)గా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది తహసీల్దార్లకు డెప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా ఉన్న బొద్దుల గంగయ్య, వేములవాడ అర్బన్ తహసీల్దార్ ఎస్.రాజిరెడ్డి, తంగళ్లపల్లి తహసీల్దార్ సదానందం, వేములవాడ ఆర్డీవో ఆఫీస్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నక్క శ్రీనివాస్‌కు ఆర్డీవోగా ప్రమోషన్ లభించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

'కవనం' ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్ తదితరులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత, కవి, గంగాడి సుధీర్‌రెడ్డి రచించిన 'కవనం' కవితా సంపుటిని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, జీవన విధానాలను ఆవిష్కరించేలా కవనం కవితా సంపుటి ఉంటుందని పేర్కొన్నారు. రచయిత సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, కవితా సంపుటిని కేటీఆర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కవులు, కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టీసాట్ సీఈవో శైలేష్‌రెడ్డి, ఉస్మానియా, అంబేద్కర్ యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు రవీందర్, సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై ఎస్పీ దిశానిర్దేశం

సిరిసిల్లక్రైం/వేములవాడ: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్రంతోపాటు, వేములవాడ ప్రాంతాలు జలమయమయ్యాయి. పలువురు నీటిలో చిక్కుకోడవంతో వారిని డీఆర్‌ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు వర్షం కురవవడంతో ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వరద ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాలైన శ్రీనగర్ కాలనీ, శాంతినగర్, వేములవాడలోని అయ్యప్ప టెంపుల్ ఏరియా, మల్లారం రోడ్డు, శాత్రాజుపల్లి, మూలవాగు తదితర ప్రాంతాల్లో ఎస్పీ పర్యవేక్షించారు. ప్రజలకు ఏదేని ప్రమాదం ఉందని తెలిస్తే డయల్ 100 కాల్ చేయాలని ఎస్పీ సూచించారు. నీటి ప్రవాహాలున్నా ఏరియాలకు ప్రజలు వీక్షించేందుకు వెళ్తారన్న సమాచారంతో రాకపోకలను నిలుపుదల చేయడంతోపాటు బారికేడ్లు, బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీటలువారిన చెరువు కట్ట



బీటలు వారిన చెరువు కట్ట

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి చెరువు కట్ట బీటలువారింది. కట్ట తెగితే సిరిసిల-సిద్దిపేటకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. అధికారులు కట్టను పరిశీలించారు.

క్లుప్తంగా

మానేరు వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్ మృతదేహం

సిరిసిల్ల క్రైం/తంగళ్లపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన బింగి శ్రీనివాస్(35) స్థానిక టెక్స్‌టైల్ పార్క్‌లో వార్పింగ్ కార్మికుడిగా పని చేసేవాడు. అతనికి రెండేళ్ల క్రితం పెళ్లి జరగగా విడాకులయ్యాయి. కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం విధులకు వెళ్లాడు. స్థానిక మానేరు వాగు వద్ద ఆగి, ఇంటికి ఫోన్ చేశాడు. తాను చనిపోతున్నానని, వచ్చి శవాన్ని తీసు కెళ్లాలని చెప్పాడు. తర్వాత నీటిలో దూకాడు. భారీ వర్షంలో కుటుంబసభ్యులు, ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది గాలించగా సిరిసిల్ల వద్ద మానేరు వాగులో అతని మృతదేహం లభ్య మైంది. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

వేములవాడ శివారు కాలనీలపై చిన్నచూపు

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము


చొక్కాల రాము

వేములవాడ: పట్టణ శివారులోని కాలనీలను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము ఒక ప్రకటనలో ఆరోపించారు. ముందుచూపు లేకపోవడంతో ఏటా వానాకాలంలో వరదలు వచ్చి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్ రాజారెడ్డిలు ఇప్పటికైనా శివారుల కాలనీల్లో శాశ్వత పనులు చేపట్టి, ప్రజలను కాపాడాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలానికి చెందిన జీల రాజు(37) మంకమ్మతోటలో ఓ ట్రావెల్స్ నడుపుతూ కుటుంబసభ్యులతో కలిసి శ్రీనగర్ కాలనీలో ఉంటున్నాడు. రాజుకు తెలిసిన వ్యక్తి అబ్దుం హకీం గురువారం ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయలేదు. అతని ట్రావెల్స్‌కు వెళ్లి చూడగా తలుపు పెట్టి ఉంది. ఫోన్ ఎత్తకపోవడం, తలుపు కొట్టినా తీయకపోవడంతో స్థానికులను పిలిచాడు. వారు వచ్చి తలుపు తెరిచి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. రాజు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వచ్చి, అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

యువతి బలవన్మరణం

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన గండు సునీత(34) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీత ఎంబీఏ చదివింది. ఆమెకు వివాహం కాలేదు. ఆరేళ్లుగా ఇంటి వద్దే ఉంటోంది. మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి బుచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘కేజీబీవీ’ సీటుకు క్రేజ్

- నిర్ణీత ప్రవేశాలకు మించి దరఖాస్తులు
- సీటు సాధించేందుకు విఫలయత్నాలు
- అవకాశం లేదంటున్న అధికారులు
- అయినా పట్టు వదలని విద్యార్థులు


వీర్నపల్లి కేజీబీవీ భవనం

> ‘ఇది కల్లోలిత ప్రాంతంగా పేరున్న వీర్నపల్లి మండలం కేంద్రంలోని కేజీబీవీ. భవనం అడవిని ఆనుకొని ఉన్న ఇందులో గతేడాది 280 మంది విద్యనభ్యసించగా ఈ ఏడాది ఇప్పటి వరకు 360 మంది ప్రవేశాలు తీసుకున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు 28 మంది హాజరుకాగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 52 మంది టెన్త్ విద్యార్థులున్నారు. ఈ పాఠశాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేజీబీవీ భవనానికి వెళ్లేందుకు అవసరమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వానాకాలంలో ఒర్రె నీటి ప్రవాహం ఉంటే రాకపోకలుండవని, అత్యవసర సమయంలో ఇబ్బందులు తప్పవని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు.

> రుద్రంగి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో గతేడాది 196 గతేడాది విద్యార్థులుండగా ప్రస్తుతం 225 ఉన్నారు. టెన్త్‌లో 50 మంది హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం పదో తరగతిలో 35 మంది ఉన్నారు. ఈ పాఠశాలకు పక్కా భవనం ఉన్నా వచ్చి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగా లేదు. మట్టిరోడ్డు కావడం, దారి మధ్యలో నీటికాలువ ఉండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సిరిసిల్ల ఎడ్యుకేషన్: వీర్నపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాల అడవిని ఆనుకొని ఉంది. రుద్రంగి మండలంలోని కేజీబీవీ పాఠశాల ఊరికి దూరంగా ఉన్నా పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ పాఠశాలల్లో సీట్లకోసం నేతలతో రెకమెండేషన్ లెటర్స్‌తో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. బోధన, భోజన వసతులతోపాటు పదో తరగతిలో సత్ఫలితాలు రావడంతో విద్యార్థులు కేజీబీవీల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో విద్యాలయాలుండడం, బాలిక విద్యను ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని స్థానికులు తెలుపుతున్నారు.

రెగ్యులర్ విద్య.. మోటివేషన్ తరగతులు

సాధారణ పాఠశాలలో పాఠ్యంశాలను బోధించడం ఉంటే, కేజీబీవీల్లో బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే, శారీరక దృఢత్వం కోసం వ్యాయామం, మానసిక స్థిరత్వం కోసం యోగా కొనసాగిస్తున్నారు. బాలికల ఆరోగ్యంకోసం రాగిజావ, రాగిలడ్డూ వంటి బలవర్ధకమైన పదార్థాలు అందిస్తున్నారు. కంప్యూటర్ ల్యాంప్స్ విధానంలో డిజిటల్ బోధన అందిస్తున్నారు. పాఠశాలలో విద్యనభ్యసించిన బాలికలు వసతి గృహాల్లో ఉండేందుకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి లైఫ్ స్కిల్స్, మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఫలితాల్లో మేటి..

విద్యార్థులు సంఖ్య ఏటా పెరుగుతుందని ప్రవేశాల సంఖ్య బట్టి తెలుస్తోంది. దీనికి అనుగుణంగా బోధనలో మెళకువలను పాటించి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గత విద్యాసంవత్సరం ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ఓవరాల్‌గా 98 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 13 కేజీబీవీల్లో 7 కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత నమోదు చేసిన జాబితాలో ఉన్నాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది ప్రవేశాలు తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు.

నిర్ణీత ప్రవేశాలకు మించి..

ఒక కేజీబీవీలో కనీసం 200 మంది విద్యార్థులను ఆరు నుంచి పదో తరగతి వరకు తీసుకునేందుకు అవకాశం ఉంది. జూనియర్ కళాశాల విద్యనందించే అవకాశం ఉన్న కేజీబీవీల్లో మరో 160 మందిని అదనంగా తీసుకునేందుకు వీలుంది. కానీ జిల్లాలోని ఏ కేజీబీవీలోనూ నిర్ణీత సంఖ్యకు మించి ప్రవేశాలు జరిగాయి. అధికంగా తీసుకున్న విద్యార్థుల గురించి ఉన్నతాధికారులు అనుమతితో జరిగినట్లు కేజీబీవీలు పర్యవేక్షణాధికారులు వెల్లడించారు. రెగ్యులర్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు తమకు కేజీబీవీలో సీటు వస్తుందన్న నమ్మకంతో యూనిఫాం, పుస్తకాలు లేకుండా ప్రైవేటు పాఠశాలలో కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లాలోని కేజీబీవీల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య

కేజీబీవీ	నిర్ణీత సీట్లు	తీసుకున్న ప్రవేశాలు	కేజీబీవీ	నిర్ణీత సీట్లు	తీసుకున్న ప్రవేశాలు
సిరిసిల్ల	360	412	చందుర్తి	200	202
ఇల్లంతకుంట	200	244	తంగళ్లపల్లి	360	346
ముస్తాబాద్	200	252	గంభీరావుపేట	200	395
బోయినిపల్లి	200	235	కోనరావుపేట	200	226
రుద్రంగి	200	232	వీర్నపలి	360	370
మర్రిపలి	360	372	వేములవాడ అర్బన్	200	210
ఎల్లారెడ్డిపేట	200	230			

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



బాలికల విద్యను ప్రోత్సహించాలి. ఫలితాలు బాగుండటంతో కస్తూర్బా పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. ప్రతి కేజీబీవీలో రాత్రిళ్ల సెక్యూరిటీ, పర్యవేక్షణకు టీచర్స్, వైద్యం కోసం ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటున్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– రమేశ్, డీఈవో, సిరిసిల్ల

ప్రవేశాల కోసం వస్తున్నారు



జిల్లాలో అన్ని కేజీబీవీలకు సొంత భవనాలున్నాయి. కొన్నింటికి రోడ్డు సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు పూర్తయ్యాయి. వీర్నపల్లి, రుద్రంగి రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. అధికారులు ఆదేశాలు, టీచర్ల సమన్వయంతో విద్యార్థులకు మంచి విద్యనందిస్తున్నాం. ప్రవేశాల కోసం విద్యార్థులు ఇప్పటికీ వస్తున్నారు.

– పద్మజ, కేజీబీవీల కో–ఆర్డినేటర్ ఎస్ఎస్ఏ, సిరిసిల్ల


కూలిన పీపుల్స్‌వార్ శంకరన్న ఇల్లు

- ఉత్తర తెలంగాణ కార్యదర్శిగా పనిచేసిన దొంత మార్కండేయ
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


కూలిపోయిన ఇల్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అప్పటి పీపుల్స్‌వార్ కార్యదర్శిగా పనిచేసిన దొంత మార్కండేయ ఉరఫ్ శంకరన్న ఇల్లు గురువారం కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శంకరన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో 1993 జనవరి 25న రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఈ మధ్యనే శంకరన్న పాత్రతో కూడిన విరాటపర్వం సినిమా తెరకెక్కించారు. శంకరన్న పాత్రలో దగ్గుబాటి రాణా హీరో పాత్ర పోషించారు.మూడు దశాబ్దాల క్రితం ఉద్యమానికి ఆకర్షితుడై పార్టీలోచేరి ఉత్తర తెలంగాణ కార్యదర్శి స్థాయిలో ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. ఆయన జ్ఞాపకంగా ఉన్న ఒక్క ఇల్లు కూలిపోవడంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ప్రాజెక్టుకు నాసా అవార్డు



అవార్డుకు ఎంపికైన ప్రాజెక్టు

సిరిసిల్లఎడ్యుకేషన్: అంతరిక్షంలో జనజీవన విధానాలకు అనుకూల, ప్రతికూల పరిస్థితులను అంచనా వేయడానికి రూపొందించిన ప్రాజెక్టును నాసా అవార్డు వరించింది. ప్రాజెక్టు తయారు చేసిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పి.అనిరుధ్, ఎస్.కౌశిక్ రామ్, టి.దయాన్ అద్వైత్, ఎస్.అక్షయ్‌రెడ్డి, ఎ.చాణక్య, టి.సాయిశ్రీనివాస్, రిషల్ విదాంత్, ఎ.అభినవ్‌రెడ్డి బృందానికి నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ గురువారం మాట్లాడుతూ.. నేషనల్ స్పేస్ సొసైటీ, నాసా ఎయిమ్స్ రీసెర్చ్ సెంటర్ సంయుక్తంగా ప్రపంచవ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహిస్తాయని తెలిపారు. 6 నుంచి 12వ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు పంపిన ప్రాజెక్టులను దేశంలోని ఏరోస్పేస్ నిపుణులు పరిశీలిస్తారని, తమ పాఠశాల విద్యార్థులు గతేడాది ఒక ప్రాజెక్టును పంపినా ఎంపిక కాలేదని చెప్పారు. ఇప్పుడు పంపిన ప్రాజెక్టు నాసా జాతీయ స్థాయి బహుమతికి ఎంపికైనట్లు మెయిల్‌లో అధికారిక ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ ప్రాజెక్టుకు వికాస్ స్పేస్ కాలనీగా పేరుందని తెలిపారు. జిల్లాలో ఇలాంటి ప్రతిష్ఠాత్మక బహుమతి రావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు అభినందించారు.

రైలు ప్రయాణంలో తకరారు

- బల్లార్ష–ఖాజీపేట సెక్షన్‌లో రైళ్లు రద్దు
- వరంగల్ వరకే తిరుపతి–కరీంనగర్ రైలు
- కొన్ని దారి మళ్లింపు, ఇంకొన్ని పాక్షికంగా రద్దు
- ప్రయాణికుల ఇబ్బందులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్నింటిని అధికారులు పాక్షికంగా రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లించారు. ఈ ఆకస్మిక పరిణామంతో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రద్దు, పాక్షిక రద్దు, దారి మళ్లిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి..

- సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ గురు, శుక్రవారాల్లో రద్దయ్యాయి.
- సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దవగా శుక్రవారం ఉదయం కూడా రద్దు చేశారు.
- సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఘన్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నడుపుతున్నారు. ఘన్‌పూర్–కాగజ్‌నగర్ వరకు రద్దు చేశారు. ఈ మూడు రైళ్ల వల్ల నిత్యం హైదరాబాద్ వెళ్లాల్సిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- తిరుపతి–కరీంనగర్ బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్‌కే పరిమితం చేశారు. వరంగల్–కరీంనగర్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. పిల్లాపాపలతో తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా లగేజీతో వర్షంలో తడుస్తూ తిరిగి బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.
- సికింద్రాబాద్–పాట్నా వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి, రామగుండం నుంచి వెళ్లాల్సి ఉండగా విజయవాడ మీదుగా దారి మళ్లించారు.
- చెన్నై–అహ్మదాబాద్ వెళ్లాల్సిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, మంచిర్యాల కాకుండా వాడి–సికింద్రాబాద్ మీదుగా మళ్లించారు.
- న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా–ఆదిలాబాద్–ముత్కేడ్ జంక్షన్ మీదుగా నిజామాబాద్ నుంచి దారి మళ్లించారు.
- గోరక్‌పూర్–సికింద్రాబాద్ రైలును పెద్దపల్లి–కరీంనగర్– నిజామాబాద్ మీదుగా దారి మళ్లించారు.

పాత పెన్షన్ విధానం ప్రకటించాలి

- ఆగస్టు 12న చలో హైదరాబాద్
- సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ


అభివాదం చేస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: పాత పెన్షన్ విధానం ప్రకటించాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. అప్పటివరకు తమ పోరాటం ఆగదన్నారు. పాత పెన్షన్ సాధన కోసం అలంపూర్‌లో మొదలైన సంకల్ప రథం గురువారం కరీంనగర్ చేరింది. స్థానిక కోర్టు చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ గార్డెన్స్‌లో ఉద్యోగులతో సమావేశమై, మాట్లాడారు. 19 ఏళ్లుగా సీపీఎస్ విధానంతో వేలాది ఉద్యోగ కుటుంబాలు మానసిక వేదనకు గురవుతున్నాయని అన్నారు. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో సీపీఎస్‌ను రద్దు చేసే తొలి రాష్ట్రం తెలంగాణ కావాలని ఆకాంక్షించారు. ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు వెల్లడించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ కుటుంబాలతో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోనె శివరాం, ప్రధాన కార్యదర్శి ఎల్తూరి సంతోష్ కుమార్, రాష్ట్ర బాధ్యులు వీరబత్తిని శ్రీను, జీవన్ కుమార్, మ్యాన పవన్, త్రిపాల్ సింగ్, కమలేశ్, లక్ష్మారెడ్డి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కరీంనగర్ బాధ్యులు డాక్టర్ సాయిని నరేందర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి మొక్క రంగు మారుతోంది

- భారీ వర్షాల కారణంగా చేలల్లో నిలుస్తున్న వరద నీరు
- దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన
- జిల్లాలో 52,256 ఎకరాల్లో సాగు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బందారపు బాల్‌రెడ్డి. గ్రామం ఎల్లారెడ్డిపేట. తనకున్న ఆరెకరాల భూమిలో పత్తి విత్తనాలు వేసి, 45 రోజులవుతోంది. ఇప్పటివరకు రూ.90 వేల వరకు ఖర్చు చేశాడు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తిలో కలుపుతీసి, క్రిమిసంహారక మందులు వేయడానికి వీల్లేకుండా పోతోంది. ఫలితంగా పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని బాల్‌రెడ్డి ఆందోళన చెందుతున్నాడు.



ఈ రైతు పేరు నిమ్మల బాబు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన ఇతను రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. అప్పు చేసి విత్తనాలు, మందులు కొనుగోలు చేసి, 50 రోజుల క్రితం విత్తనాలు వేశాడు. ఒకసారి కలుపు తీశాడు. ఈ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలతో పంట నీట మునిగింది. పత్తి మొక్కల రంగు మారుతుండటంతో గుండెలు బాదుకుంటున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రైతులందరిదీ ఇదే పరిస్థితి.


పత్తి చేనులో నిలిచిన నీరు, రంగు మారిన మొక్కలు

ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తొలకరి జల్లులు సకాలంలో పడటంతో దుక్కులు సిద్ధం చేసుకొని, పంటలు సాగు చేశారు. వరుస వర్షాలతో నీరు రోజుల తరబడి నిలిచి, పత్తి మొక్కల రంగు మారుతోంది. ఫలితంగా మొక్కలు ఎదగక పోవడమే కాకుండా పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా రైతులు 1,39,896 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వీటిలో 52,256 ఎకరాల్లో పత్తి, 86,895 ఎకరాల్లో వరి వేశారు. మొదట్లో వర్షాల కోసం నిరీక్షించారు. ప్రస్తుతం ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పత్తికి ఎకరాకు రూ.15 వేలు, వరికి రూ.10 వేలు, మొక్కజొన్నకు రూ.8 వేలు, కందులకు రూ.12 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పత్తి మొక్కలు రంగుమారి నేలచూపు చూస్తున్నాయి. వరి పొలాల్లో ఇసుకమేటలు వేస్తున్నాయని, కలుపు దశలో ఉన్న వరి ఎదిగే పరిస్థితులు లేవని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న ఈదురుగాలులకు నేలవాలింది. కంది నీటిలో కనిపించకుండా పోయిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. రంగుమారిన పత్తి మొక్కల స్థానంలో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వరి వేసినవారు క్రిమిసంహారక మందులను ఎక్కువ మోతాదులో పిచికారీ చేసి, పంటను రక్షించుకోవాల్సిందే.

నీటిని తొలగించుకోవాలి



వర్షాలు ఆగిన వెంటనే పంట చేలల్లో నిలిచిన వర్షపు నీటిని రైతులు తొలగించుకోవాలి. పత్తిలో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంటే మొక్కలు రంగు మారి ఎదుగుదల లోపించి, దిగుబడి తగ్గుతుంది. సలహాలు, సూచనల కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

– చాద భూంరెడ్డి, ఏవో, ఎల్లారెడ్డిపేట